క్లుప్తంగా

ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి



ప్రవచిస్తున్న శివానంద నిమాయి

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిర చైర్మన్ శివానంద నిమాయి అన్నారు. మాచవరం దొమ్మేటివారిపాలెంలోని శ్రీకృష్ణుడి ఆలయంలో శివానంద నిమాయి ఆధ్వర్యంలో దాస్, నందన దాస్‌లు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శివానంద నిమాయి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందూ సంప్రదాయాలను పాటించాలన్నారు. కృష్ణుడు చూపిన ధర్మబాటలో పయనించాలన్నారు. అంతకుముందు గోవర్ధన్ అనే లీల ప్రవచనాలను భక్తులకు వివరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ శెట్టిబలిజ సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ టీమ్‌కు సత్యరామ్‌పాల్



మామిడికుదురు: ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ క్రికెట్ టీమ్‌కు మామిడికుదురుకు చెందిన మట్టా సత్యరామ్‌పాల్ ఎంపికయ్యారు. నగరం స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న రామ్‌పాల్‌ను జిల్లా జట్టుకు ఎంపిక చేశారని క్రికెట్ కోచ్ మట్టా సత్తిబాబు ఆదివారం తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి అమలాపురంలో జరిగే స్టేట్ మీట్‌లో కోనసీమ జిల్లా జట్టు 12 జిల్లాల జట్లతో తలపడుతుందన్నారు. జిల్లా టీమ్‌కు ఎంపికైన రామ్‌పాల్‌ను స్కూల్ ఉపాధ్యాయులు, స్థానికులు, క్రీడాభిమానులు అభినందించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎన్జీఓ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రామారావు

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ కొత్తపేట తాలూకా యూనిట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోమ్ వద్ద ఎన్జీఓల సమావేశం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు మోటూరి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా పెండింగ్ డీఏలు, ఐఆర్, పీఆర్సీ నూతన కమిటీని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్జీఓల సభ్యత్వ నమోదు చేసుకోవాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొవ్వూరి ప్రభాకరరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లా వెంకట రామారావు (బాబి), అసోసియేట్ అధ్యక్షుడు ఏపుగంటి సురేష్, ఉపాధ్యక్షుడు నాగరాజు, సంయుక్త కార్యదర్శి అరుణసుందరి పాల్గొన్నారు.

హాస్టళ్లలో సదుపాయాలు కల్పించాలి



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు చిట్టిబాబు

మామిడికుదురు: హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం మామిడికుదురులో బాలుర, బాలికల వసతి గృహాలను ఆయన పరిశీలించారు. బాలికల వసతి గృహం పూర్తిగా పాడైందని, దానిని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. బాలుర వసతి గృహం తలుపులు అధ్వానంగా ఉన్నాయని, విద్యార్థులకు ప్రతి నెలా కాస్మోటిక్ చార్జీలు ఇవ్వడం లేదన్నారు. డ్రైనేజీ సమస్య వేధిస్తుందని, హాస్టళ్ల చుట్టూ తుప్పలు పెరిగిపోయాయని, పాముల బెడద పొంచి ఉందని చిట్టిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. బాలుర వసతి గృహం వార్డెన్ ఇన్‌చార్జి కావడంతో విధులకు సక్రమంగా రావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. హాస్టళ్లలో సమస్యలపై కలెక్టర్ మహేష్ కుమార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం ఇస్తామన్నారు. ఆయన వెంట పార్టీ నేతలు అప్పన శ్రీరామకృష్ణ, మాచవరపు శివన్నారాయణ, ఒంటెద్దు బాబి, అయితాబత్తుల సుభాషిణి, బొంతు రాజేందర్, మొల్లేటి వెంకటేశ్వరరావు, రాజు తదితరులు ఉన్నారు.

చిట్టడవి కాదు సబ్ జైలే..

- నిరుపయోగంగా మారిన భవనం
- భయానకంగా పరిసరాలు

ఆలమూరు: అక్కడకు వెళ్తే చిట్టడవిని తలపిస్తోంది.. అమ్మో అనేలా భయంకరంగా కనిపిస్తోంది.. ఇదేదో ఎక్కడో అనుకుంటే పొరబడినట్టే. ఆలమూరులోకి సబ్ జైలు దుస్థితి. అన్ని హంగులున్నా నిర్వహణ లోపంతో 23 ఏళ్ల కిందట ఇది మూతబడింది. ఏళ్లు గడుస్తున్నా పునః ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నా సబ్ జైలు దుస్థితి మాత్రం అలానే ఉంది. రూ.లక్షలతో నిర్మించిన సబ్ జైలు నేటికీ నిరుపయోగంగా దర్శనమిస్తోంది. చిట్టడవిని తలపిస్తూ విష సర్పాలకు ఆవాసంగా మారింది. ఆలమూరులో జూనియర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఏజేఎఫ్‌సీఎం కోర్టు, సెషన్స్ కోర్టులు ఉండటంతో తరచూ ఇక్కడకు మండపేట, కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాలకు సంబంధించిన నేరస్తులను తీసుకు వస్తుంటారు. ఈ కోర్టు పరిధిలో నాలుగు పోలీస్ స్టేషన్లతో పాటు ఒక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఉంది. దీనివల్ల కేసుల సంఖ్య నానాటికీ పెరిగిపోవడంతో ఖైదీలను తరలించడం పోలీసులకు ఇబ్బందిగా మారింది. గతంలో నేరస్తులు, రిమాండు ఖైదీలను సమీపంలోని కోర్టు నుంచి నేరుగా స్థానిక సబ్ జైలుకు తీసుకు వచ్చేవారు. ప్రస్తుతం సబ్ జైలును మూసివేయడంతో సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామచంద్రపురం సబ్ జైలుకు తీసుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నేరస్తులను తరలించడం కష్టమే

నాలుగు పోలీస్ స్టేషన్లలో నిందితులుగా కేసులు ఎదుర్కొంటున్న అనేక మందిని స్థానిక కోర్టులకు తరలించాల్సి ఉంది. పోలీసులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా నేరస్తులు పారిపోయే ప్రమాదం ఉండటంతో వారిని పోలీస్ స్టేషన్ నుంచి కోర్టుకు, కోర్టు నుంచి సబ్‌జైలు తరలించడం కష్టసాధ్యంగా మారింది. గతంలో మండపేట నుంచి రిమాండ్ ఖైదీలను తరలిస్తుండగా పారిపోయేందుకు ప్రయత్నించాగా పోలీసులు అతికష్టం మీద వారిని అరెస్ట్ చేసిన సందర్భాలు ఉన్నాయి. కరుడుగట్టిన నేరస్తులను బేడీలు వేసి తీసుకు వస్తున్నారు. జైళ్ల శాఖ స్పందించి సబ్ జైలును పునరుద్ధరిస్తే పోలీసులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఖైదీల తరలింపు సులభతరం అవుతుందని పోలీసు సిబ్బంది చెబుతున్నారు. అసలే సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్న స్థానిక కోర్టు పరిధిలోని పోలీసులకు ఖైదీలను తరలించడం కత్తిసాముగా మారింది.



ఆలమూరులో చిట్టడవిని తలపిస్తున్న సబ్ జైలు



ఆలమూరులో మూతబడిన సబ్ జైలు

ఎందుకు మూతపడిందంటే..

1994లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో స్థానిక కోర్టు నుంచి ఖైదీల తరలింపులో తలెత్తుతున్న ఇబ్బందులను గుర్తించి ఆలమూరు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఖాళీగా ఉన్న తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సబ్ జైలు నిర్మించారు. సుదీర్ఘకాలం అనంతరం ఎట్టకేలకు నిర్మాణం పూర్తి చేసుకుని సబ్ జైలు అందుబాటులోకి వచ్చినా అధికారుల సమన్వయ లోపంతో మరింత ఆలస్యంగా 1997లో సబ్‌జైలు ప్రారంభమైంది. అప్పటి నుంచి రామచంద్రపురం సబ్ జైలుకు ఖైదీల తరలింపును అధికారులు నిలిపివేసి స్థానిక సబ్ జైలుకు తరలించేవారు. ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నా అధికారుల అలసత్వంతో సబ్ జైలు సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు నిలయంగా మారిపోయింది. దీంతో పాటు సిబ్బంది చేతివాటం ఎక్కువ కావటంతో సబ్‌జైలు ఖైదీలకు స్వర్గధామం అయ్యింది. వీటిని అలుసుగా తీసుకున్న ఖైదీలు 1998 మార్చిలో, 1999 నవంబర్‌లో గోడదూకి పారిపోయారు. దీంతో అప్రమత్తమైన జైళ్లశాఖ విచారణ జరిపి అందుకు బాధ్యులైన సిబ్బందిని సస్పెండ్ చేసింది. కొన్ని రోజులు పరిస్థితులు కుదుట పడినా తిరిగి పాత కథే పునరావృతమైంది. 2001 మే 30వ తేదీ రాత్రి అండర్ ట్రయిల్ ఖైదీలు గోడదూకి పారిపోయారు. దీంతో జైళ్ల శాఖ ఎటువంటి విచారణ జరపకుండానే సబ్ జైలును మూసివేసింది. ఇప్పటికే రెండు సార్లు జైళ్లశాఖ అధికారులతో పాటు డీఐజీ కూడా స్థానిక సబ్ జైలును పరిశీలించినా ఫలితం లేకపోయింది. దీనిని తెరిపిస్తే ఇబ్బంది తప్పుతుందని పోలీసులు అంటున్నారు.

పగలు ఎండ.. రాత్రి మంచు

అంబాజీపేట: పగలు వేసవిని తలపించేలా ఎండలు మండిపోతుంటే.. రాత్రి మంచు కురుస్తుండడంతో వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి 8 గంటల నుంచే మంచు కురుస్తుండడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోతుంది. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత పెరగడంతో పాటు ఉక్కబోత అధికంగా ఉంటుంది. అధిక ఉష్ణోగ్రతను తట్టుకోలేక చాలామంది ఇళ్లకే పరిమితమవుతున్నారు. వర్షాకాలం వెళ్లి... శీతాకాలం వచ్చినా రోహిణి కార్తెలో ఎండల్లా ఇప్పుడు ఉన్నాయంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రతకు జన సంచారం లేక ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వాతావరణ మార్పుల నేపథ్యంలో గ్రామాల్లోని ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. సాయంత్రం సమయంలో చలిగాలులు, ఉదయం ఎండ తీవ్రతకు జ్వరంతో పాటు దగ్గు, జలుబుతో రోగాలకు గురవుతున్నారు. వాతావరణ మార్పుల కారణంగా ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహారాన్ని భుజించాలని వైద్యులు సూచిస్తున్నారు.



కె.పెదపూడిలో ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

తరలిపోతున్న ఇసుక

మామిడికుదురు: ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. అధికారులు మామూళ్ల మత్తులో తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. బహిరంగంగానే ఇసుక తవ్వకాలు సాగిస్తున్నా వాటికి ఎవరూ ఎదురు చెప్పడం లేదు. మామిడికుదురు మండలం ఆదుర్రు, బి.దొడ్డవరం గ్రామాల్లో ఇసుక తవ్వకాలు భారీగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాశర్లపూడి ప్రాంతానికి వెళ్లి అక్కడ ఇసుకను పడవల్లో ఎగుమతి చేసి బి.దొడ్డవరం, ఆదుర్రు గ్రామాల్లో దింపి ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారని చెబుతున్నారు. ఈ వ్యవహారం అంతా రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో జరుగుతున్నా వారు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి. అక్రమంగా తవ్విన ఇసుకను ఎక్కువ ధరకు అమ్మి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలో ఇసుక తవ్వకాలకు ఏ విధమైన అనుమతులు మంజూరు కాలేదు. కానీ ఇసుక తవ్వకాలు మాత్రం చకచకా జరిగిపోతున్నాయి. ఇసుక అక్రమ తవ్వకాలపై మీడియాలో పలు కథనాలు ప్రచురితమవుతున్నా మాకేంటి అన్న విధంగా అధికారుల తీరు ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను అదుపు చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ఆదుర్రు గ్రామంలో రాత్రి సమయంలో ఇసుక తరలింపు

వైభవంగా లక్ష బిల్వార్చన

మామిడికుదురు: శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తిక మాసం ఆదివారం పాశర్లపూడి గ్రామంలోని ఉమా చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన కనుల పండువలా జరిగింది. ఆలయ అర్చకుడు కొత్తలంక మహేష్ ఆధ్వర్యంలో మల్లేశ్వరస్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకాలు, ఉమాదేవికి లక్ష బిల్వార్చన పూజలు చేశారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. పూజ అనంతరం మల్లేశ్వరస్వామికి పలు రకాల పుష్పాలు, పండ్లతో అలంకరణ చేశారు. పలువురు భక్త దంపతులు లక్ష బిల్వార్చనలో కర్తలుగా పాల్గొన్నారు.



పాశర్లపూడిలో మల్లేశ్వరస్వామికి పుష్పాలతో అలంకరణ



కొత్తపేటలో శివలింగార్చన చేస్తున్న వెంకటేశ్వరరావు, సత్యవాణి దంపతులు

కొత్తపేట: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానికంగా ఆదివారం లక్షబిల్వార్చన పూజలు వైభవంగా జరిగాయి. రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు, పలివెల ఉమాకొప్పేశ్వర స్వామి ఆలయ అన్నదాన కమిటీ కన్వీనర్ తోట వెంకటేశ్వరరావు, కాంతి భారతి విద్యా సంస్థల కరస్పాండెంట్ సత్యవాణి దంపతుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకూ వివిధ పూజలు నిర్వహించారు. పలివెల, కొత్తపేట తదితర ప్రాంతాల వేద పండితుల బృందం విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి శివలింగానికి పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, మహన్యాస పారాయణ, లక్ష బిల్వార్చన చేశారు. రాత్రి ఆ ప్రాంగణంలో అఖండ దీపారాధన ఆకట్టుకుంది. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

కిటకిటలాడిన అంతర్వేది క్షేత్రం

సఖినేటిపల్లి: కార్తిక మాసం ఆపై ఆదివారం సెలవుదినం కావడంతో అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప స్వాములు భారీగా తరలి వచ్చారు. ఆలయంలోని నారసింహ సుదర్శన హోమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదాన పథకంలో భక్తులకు భోజన వసతిని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కుటుంబ సమేతంగా వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద కలెక్టర్‌కు ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. కలెక్టర్‌కు స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఇచ్చారు.



అంతర్వేదిలో కృష్ణా జిల్లా కలెక్టర్‌కు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఏసీ సత్యనారాయణ

శ్రీనివాసా.. శ్రీవేంకటేశా



భక్తులతో పోటెత్తిన వాడపల్లి వెంకన్న ఆలయం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం కార్తిక మాసం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన అష్టోత్తర పూజల్లో ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్న సమారాధన జరిగింది. ఈ ఏర్పాట్లను ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధర్‌రావు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. నిత్య అన్నదాన కార్యక్రమం ద్వారా రూ.96,175, శాశ్వత అన్నదానానికి రూ.83,473, అష్టోత్తర పూజల ద్వారా రూ.90 వేలు, స్వామివారి నిత్య కల్యాణం ద్వారా రూ.26,250, స్వామివారి ప్రత్యేక దర్శనానికి రూ.1,09,500, విశిష్ట దర్శనం ద్వారా రూ.2,800, స్వామివారి వేదాశీర్వచనం ద్వారా రూ.12,276, లడ్డూ ప్రసాద విక్రయాలతో రూ.1,37,790, స్వామి కల్యాణ కట్టం ద్వారా రూ.16,160 ఇలా మొత్తం రూ.5,74,424 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

ఇసుక లారీ సీజ్

ఆత్రేయపురం: మండల పరిధిలోని పేరవరం ఇసుక రీచ్ నుంచి ఇసుకను తరలించేందుకు ప్రయత్నించిన లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.రాము తెలిపారు. లారీని పేరవరంలో సీజ్ చేసి ఆత్రేయపురం పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. గ్రామాల్లో అనధికారికంగా ఎక్కడైనా ఇసుక తవ్వకాలు జరిగితే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.



సీజ్ చేసిన ఇసుక లారీ

అయ్యప్ప దీక్ష.. ఆరోగ్య రక్ష

- నియమ నిష్టలతో మాలధారులు
- సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు

మామిడికుదురు: కఠినమైన నియమ నిష్టలతో ఆచరించే అయ్యప్పస్వామి దీక్షతో అంతటా ఆధ్యాత్మిక పరిమళాలు వెల్లివిరుస్తున్నాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఇదే హడావుడి నెలకొంది. ఏటా అయ్యప్ప స్వామి దీక్ష స్వీకరించే భక్తుల సంఖ్య పెరుగుతోంది. అయ్యప్ప దీక్ష ఆధ్యాత్మిక చింతనతో పాటు సంపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందని పలువురు చెబుతున్నారు. ఏటా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ భక్తులు స్వామి దీక్ష స్వీకరిస్తారు. స్వామివారి మండల దీక్ష, తదుపరి జ్యోతి దర్శనం చేపడతారు. పి.గన్నవరం నియోజకవర్గంలో మామిడికుదురు, అంబాజీపేట, పి.గన్నవరం, అయినవిల్లి మండలాలతో పాటు ఇతర మండలాల పరిధిలో భారీ సంఖ్యలో భక్తులు అయ్యప్ప దీక్ష చేపట్టారు. 41 రోజుల కఠోర నియమ, నిష్టలతో ఆచరించే స్వామి దీక్ష శారీరక ఆరోగ్యాన్ని ప్రసాదించడంతో పాటు మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. ప్రతి వ్యక్తిలో సత్ప్రవర్తన, క్రమశిక్షణను అలవరుస్తుంది. శాఖాహారం తీసుకోవడం ఎటువంటి బేధాలు లేకుండా అందరినీ సమానంగా చూడడం వంటి నియమాలను పాటించడం ద్వారా సమానత్వాన్ని బోధిస్తుంది. దీక్ష పూర్తి చేసుకున్న స్వాములు అయ్యప్ప కొలువు దీరిన శబరిమల కొండకు వెళ్తారు. కొంత మంది స్థానికంగా మండపేట మండలం ద్వారపూడిలో కొలువు దీరిన అయ్యప్ప స్వామికి ఇరుముడులు సమర్పిస్తారు. ఈ దీక్షలో పాటించే నియమాల్లో ఆరోగ్యకరమైన ఎన్నో విషయాలు ఉన్నాయని గురుస్వాములు పేర్కొంటున్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం చేసే చన్నీటి స్నానంతో శరీరంలో శక్తి, ఏకాగ్రత, ఉత్తేజం పెరుగుతాయని, తల స్నానంతో రక్తపోటు తగ్గి జీర్ణశక్తి పెరుగుతుందని చెబుతున్నారు.



పూజలు చేస్తున్న అయ్యప్ప దీక్షాధారులు

దీక్షతో మానసిక ప్రశాంతత



అయ్యప్ప దీక్షలో చేసే నియమ నిష్టలతో ఎన్నో ఆరోగ్య పరమైన అద్భుతాలు దాగి ఉన్నాయి. నుదుటిపై చందనం, కుంకుమ, విబూది ధరించడం వల్ల చల్లదనంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుంది. కాళ్లకు చెప్పులు లేకుండా నడవడంతో చిన్న, చిన్న రాళ్లు పాదాలను తాకడం వల్ల స్పందన రావడంతో పాటు రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది.

– జయంతి సుబ్బారావు, పెదపట్నం, గురుస్వామి

మంచి మార్గంలో పయనించేలా..



అయ్యప్ప దీక్షలో ఉన్నవారు ప్రధానంగా మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉంటారు. దానివల్ల వారు మంచి మార్గంలో పయనిస్తారు. మాల వేయడం ద్వారా వ్యసనాలకు పూర్తిగా దూరమై మంచి మార్గంలో పయనిస్తున్న వారు ఎంతో మంది ఉన్నారు. ఇటు ఆధ్యాత్మిక భావంతో పాటు మరెన్నో సత్ఫలితాలు పొందవచ్చు.

– పాటబత్తుల కృష్ణ, గురుస్వామి, తాటిపాక

ఆధ్యాత్మిక భావం పెరిగింది



ఇటీవల కాలంలో ప్రజల్లో ఆధ్యాత్మిక భావం పెరిగింది. అయ్యప్ప మాల ధరించడం వల్ల దైవచింతనతో ఆరోగ్యం మెరుగుపడుతుంది. దీక్షలో చేసే కఠోర నిష్టలు అనారోగ్యం బారిన పడకుండా మనిషికి ఎంతో ఉపకరిస్తాయి. దీక్షలో ఉన్నవారు ఆరోగ్యపరంగా దుష్పరిణామాలు ఎదుర్కొన్న సంఘటనలు నా జీవితంలో చూడలేదు.

– కాలిశెట్టి ప్రకాష్, గురుస్వామి, మానేపల్లి

అతుకులు.. గతుకులు



ఇసుకపూడిలో అధ్వానంగా మారిన ప్రధాన రహదారి

అంబాజీపేట: అక్కడక్కడా రోడ్డు.. మొత్తం గుంతలే అన్నట్టు ఉంది ఇసుకపూడిలో ప్రధాన రహదారి దుస్థితి. చాలాచోట్ల గుంతలు పడి నడిచేందుకు కూడా వీల్లేకుండా మారింది. కొద్దిపాటి వర్షానికే రహదారి చిత్తడిగా మారడంతో అటుగా వెళ్లే విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు, రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డులో వాహనదారులు ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. ఈ రోడ్డును అభివృద్ధి చేస్తామని చెబుతున్నా ఆ హామీ మాత్రం నెరవేరడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్యాన్సర్ బాధితురాలికి సాయం



బాధితురాలికి సాయం అందజేస్తున్న కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళకు స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.12 వేలను అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం సీతారామపురం గ్రామానికి చెందిన అరిపాక మంగ గర్భాశయ క్యాన్సర్‌తో వైద్యం చేయించుకుంటున్నారు. ప్రతి నెలా ఆమెకు మందులకు రూ.8 వేల వరకూ ఖర్చు అవుతుంది. భర్త, పిల్లలు ఎవరూ లేరు. చెల్లెలు పనికి వెళుతూ పోషిస్తుంది. వైద్యం చేయించడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. దీంతో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరగా, మంగ ఇంటికి వెళ్లి నగదును అందజేశారు.

ఐక్యత పెంచేందుకే వన సమారాధనలు



తాటిపాకలో వన మహోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

రాజోలు: సమాజంలో ఐక్యత పెంచేందుకే వన సమారాధనలు దోహదపడతాయని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం తాటిపాక శెట్టిబలిజ సంక్షేమ సంఘ భవనం వద్ద రాజోలు తాలూకా శెట్టిబలిజ, గౌడ సంఘం ఆధ్వర్యంలో తాలూకా శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యేలు దేవ వరప్రసాద్, పితాని సత్యనారాయణ, రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, గొల్లపల్లి సూర్యారావు, శెట్టిబలిజ సంఘ ప్రధాన కార్యదర్శి గుబ్బల మనోహర్, కన్వీనర్ గుబ్బల శ్రీనివాస్, కట్టా శ్రీను, గుబ్బల రోజా రమణి, చెల్లింగి ఈశ్వరి, పురుషోత్తం, శెట్టిబలిజ, గౌడ ప్రతినిధులు పాల్గొన్నారు.